క్లుప్తంగా

జీతాలు చెల్లించాలి

ఒంగోలు: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రాష్ట్ర గవర్నర్ జీతాలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈనెల 6వ తేదీ వరకు కూడా జీతాలు బ్యాంక్ ఖాతాల్లో జమకాలేదన్నారు. చాలామంది ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు 5వ తేదీన బ్యాంకులకు సంబంధించి ఈఎంఐలు 90 శాతం మంది చెల్లించాల్సి ఉందన్నారు. గవర్నర్ చొరవ తీసుకుని జీతాలు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

10న పాస్టర్ల సమావేశం

ఒంగోలు రూరల్: రూరల్‌లోని కరవది బైబిల్ మిషన్ చర్చిలో బైబిల్ మిషన్ డిస్ట్రిక్ ఇన్‌చార్జి రెవరెంట్ ఆర్‌ఎంపీ ప్రభాకర్ కుమార్ ఆధ్వర్యంలో పాస్టర్ల సమావేశం ఈ నెల 10వ తేదీన బైబిల్ మిషన్ చర్చి ప్రాంగణంలో జరుగుతుందని ఆయన తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి రిజిస్ట్రేషన్ కార్యక్రమం అనంతరం టీవీ ప్రసంగీకులు బ్రదర్ విశ్వం వాక్యం సందేశం అందిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి హాజరై దైవ వర్తమానాన్ని, పాస్టర్ల నియమ నిబంధనలు తెలుసుకోవాలని ఓ ప్రకటనలో తెలిపారు.

నీట్ ఫలితాల్లో కిరణ్మయికి 656 మార్కులు



కిరణ్మయికి స్వీట్లు తినిపిస్తున్న దృశ్యం

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు గ్రామానికి చెందిన ఆలూరు కిరణ్మయి ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో 656 మార్కులతో జాతీయ స్థాయిలో ఓబీసీ కోటాలో 10,718 ర్యాంకు సాధించింది. కిరణ్మయి ఇంటర్‌మీడియెట్ బైపీసీలో 990 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించింది. కిరణ్మయి తండ్రి గిరి బాబు విద్యా శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, తల్లి శాంతి గృహిణి, ఎంబీబీఎస్ పూర్తి చేసి న్యూరాలజీలో పీజీ చేయడమే తన లక్ష్యమని కిరణ్మయి తెలిపింది. నీట్‌లో మంచి మార్కులు సాధించిన సందర్భంగా కిరణ్మయికి ఆమె తల్లి శాంతి స్వీట్లు తినిపించి తన ఆనందాన్ని చాటుకుంది.

10న మండల సర్వసభ్య సమావేశం

సింగరాయకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 10న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేష్‌కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నాగిరెడ్డిపల్లి ఆస్పత్రి తనిఖీ

వెలిగండ్ల: మండలంలోని నాగిరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ సురేష్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో మందుల గదిని, రోగులు ఉండే గదిని పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. వైద్యురాలు హైమావతికి ఆస్పత్రిలో కొంతమంది ఆరోగ్య సిబ్బందికి మధ్య ఉన్న విభేదాలపై ఆరా తీశారు. ఇద్దరి అభియోగాలను రికార్డు చేసి ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ సురేష్‌కుమార్ తెలిపారు.

దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు

కొమరోలు: వివిధ గ్రామాల్లో దివ్యాంగ బాలబాలికలను మండల విద్యాశాఖాధికారి బి.వెంకటరత్నం గురువారం గుర్తించారు. మండలంలోని గ్రామాల్లో మూగ, చెవుడు, అంగవైకల్యం, అంధత్వం, తలసేమియా వ్యాధిగ్రస్తులను గుర్తించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ కాగా ఆయన వారిని గుర్తించారు. రెడ్డిచెర్ల, మల్లారెడ్డిపల్లె గ్రామాల్లో ఐదుగురు దివ్యాంగులను గుర్తించి అధికారులకు నివేదిక అందించారు.

భక్తిశ్రద్ధలతో శని జయంతి



సామూహిక కుంకుమ పూజలో మహిళా భక్తులు



శనీశ్వర పూజలో..

ఒంగోలు మెట్రో: వైశాఖ మాసం అమావాస్య శని జయంతి సందర్భంగా గొచారంలో ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని, శని మహర్దశ జరుగుతున్న జాతకులు గురువారం నవగ్రహాల్లో శనీశ్వరునికి తైలాభిషేకాలు, శని అష్టోత్తర పూజలు నిర్వహించారు. అమావాస్య కలిసి రావడంతో అమ్మవారి దేవాలయాల్లో అభిషేకాలు కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక గంటపాలెంలోని పార్వతీ అమ్మవారికి, బాలాజీ రావు పేటలో శ్రీ కనకదుర్గమ్మ వారికి, కేశవ స్వామి పేటలోని విజయ దుర్గ అమ్మవారి దేవస్థానం, లాయర్ పేట షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు జరిగాయి. కేశవ స్వామి పేటలో లలితా ఆశ్రమంలో లలితా అమ్మవారికి, గద్దలగుంట మహాలక్ష్మి, మహా సరస్వతి, రాజరాజేశ్వరి అమ్మవారికి, చెన్నకేశవ స్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో నాగలక్ష్మి అమ్మవారికి, సమతా నగర్ కాలవ దగ్గర వెలసి ఉన్న కనకదుర్గ అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. మంగమూరు రోడ్డు గాయత్రి మందిరంలో పంచముఖ గాయత్రి అమ్మవారికి, రంగారాయుడు చెరువు దగ్గర కంచి కామాక్షమ్మ దేవస్థానం, ఉదయం ఎనిమిది గంటల నుంచి ఆలయ అర్చక స్వాములు అమ్మవార్ల మూలవిరాట్‌కు శ్రీ సూక్తంతో పాలు, పెరుగు, తేనె, చక్కెర, పండ్ల రసాలతో అభిషేకించి, వివిధ రకాల పూలతో చక్కగా పుష్పాలంకరణ గావించారు. శ్రీ చక్రానికి దేవి ఖడ్గమాలతో అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించి మంగళ హారతులతో భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పించారు. దేవస్థానం పాలకవర్గం స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా బేతేల్ మందిర ప్రతిష్ఠోత్సవాలు



దైవ సందేశాన్ని ఇస్తున్న రెవరెంట్ మనోజాన్, రెవరెంట్ శ్యాముల్ పీటర్, బేతేల్ ఫౌండర్ బేబీస్టార్, పాస్టర్ విక్టర్‌పాల్



పాల్గొన్న భక్తులు

ఒంగోలు రూరల్: రూరల్‌లోని కరవది క్రిస్టియన్ పేట బేతేల్ ప్రార్థనా ఆవరణ మందిరంలో ఉన్న బేతేల్ ప్రార్థనా మందిరం విస్తరణ, పునఃప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం బేతేల్ ఫౌండర్ కుమారి బేబీస్టార్, పాస్టర్ విక్టర్ పాల్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయ ప్రతిష్టా కార్యక్రమాలు లాంఛనంగా చెన్నైకు చెందిన రెవరెండ్ మనోజాన్, కోయింబత్తూరుకు చెందిన రెవరెంట్ శ్యాముల్ పీటర్, ఆలయ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా మనోజాన్ మాట్లాడుతూ దేవుడు తనకు బిడ్డలకు అందించిన పది ఆజ్ఞలను ఈ నూతన ఆలయంలో తూచా తప్పకుండా పాటించాల్సిందిగా కోరారు. నూతనంగా నిర్మించుకున్న ఈ ఆలయంలో నూతన మనస్సు , నూతన హృదయంతో జీవించాలని అలాగే ఒకరి ఎడల ఒకరు ప్రేమ, సహోదర భావం కలిగి ఉండాలని కోరారు. ఒక ఆలయం నిర్మించటం ఎంతో కష్టతరమైన, క్లిష్టతరమైన అంశమని గతంలో ఉన్న ఆలయాన్ని విస్తరింప చేయటం ఆర్థిక ఇబ్బందులతో కూడిందని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ, సంఘంలోని వారికి , సంఘ పెద్దలకు, యూత్‌కు దైవ ఆశీస్సులు అందజేశారు. బేబీస్టార్, విక్టర్‌పాల్ పూర్వీకులు వారి రక్త సంబంధీకులు శంకుస్థాపన చేసిన ఈ ఆలయ అభివృద్ధి చెందటం సంతోషదాయకమన్నారు. పూత మనస్సుతో దేవుని యందు భయభక్తులు కలిగి సంఘారాధనకు రావాలని దేవుని మార్గంలో నడవాలని అన్నారు. రెవరెంట్ శ్యాముల్ పీటర్ మాట్లాడుతూ ఆలయ విస్తరణ జరిగిందంటే దేవుని మార్గంలో అనేకులు నడిపిస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. భయభక్తులు కలిగి బైబిల్ నిబంధనలు నూతన ఆలయంలో పాటించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నూతన ఆలయం నిర్మాణ నిర్వహణకు పూనుకున్న కుమారి బేబీస్టార్‌ను, విక్టర్ పాల్‌ను సహకరించిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బేతేల్ వారి సంగీతం అందించారు. అనంతరం ఈ ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన వివిధ ప్రాంతాల వారికి, కరవది సంఘానికి ప్రత్యేక విందు అందజేశారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ప్రతిష్టా ఉత్సవాలు 6,7,8 తారీఖుల్లో సాయంత్రం 6 గంటలకు ప్రార్థనా ఉత్సవాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతిరోజూ రెవరెంట్ శ్యాముల్ పీటర్, వైజాగ్‌కు చెందిన విజయ్‌కుమార్ వారు దైవసందేశాన్ని అందించనున్నారు.

టంగుటూరులో భారీ వర్షం



టంగుటూరులో వర్షం పడుతున్న దృశ్యం

టంగుటూరు: టంగుటూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో గ్రామాలల్లో అని రహదారులు వర్షపు నీటితో నిండిపాయాయి. స్థానిక బొమ్మల సెంటర్లో వర్షం నీరు పారుతుండటంతో వాహదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పొతుల చెంచయ్య వెస్టు కాలనీలో ఇళ్ళలోకి వర్షపు నీరు చేరాయి. పంటలు ఏమీ లేవని వ్యవసాయాధికారులు తెలిపారు, మండలంలో సుమారు 65 మి.మీ వర్షపాతం వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

రైతులకు విత్తనాలు సరఫరా చేయాలి

ముండ్లమూరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన విత్తనాలు ఉచితంగా అందజేయాలని కోరుతూ మండల వ్యవసాయాధికారి ఎండీ ఫారుక్‌కు ఏపీ రైతు సంఘ మండల నాయకులు పంటా ఏడుకొండలు, గాలి వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు. మండలంలోని పోలవరం రైతు భరోసా కేంద్రం పరిధిలోని శంకరాపురం గ్రామ రైతులకు విత్తనాలు ఇవ్వడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారని తెలిపారు. జోక్యం చేసుకొని రైతులందరికీ అవసరమైన అన్ని రకాల విత్తనాలను తక్షణమే అందేలా చూడాలన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారన్నారు. రైతులకు అవసరమైన కంది, మినుము, సజ్జ, మొక్కజొన్న మొదలగు విత్తనాలను రైతులకు సకాలంలో అందించాలని కోరారు.

కనిగిరి డివిజన్‌లో 225 మి.మీ వర్షపాతం నమోదు

కనిగిరి రూరల్: కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని 13 మండలాల్లో 225 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా సరాసరిన 17.1 వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి, వాగుల్లో, కుంటల్లో నీరు చేరాయి. కనిగిరి మండలంలో 2.4 మి.మీ, వెలిగండ్లలో 25.2 మి.మీల, హెచ్‌ఎంపాడులో 46.2 మి.మీ, పామూరులో 2.4 మి.మీ, పీసీపల్లిలో 34.0 మి.మీ, సీఎస్‌పురంలో 12.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

అనాథ పిల్లలకు లయన్స్ క్లబ్ చేయూత

బేస్తవారిపేట: మండలంలోని జేబీకే పురంలో తల్లిదండ్రులు చనిపోవడంతో అనాథలుగా మిగిలిన ముగ్గురు పిల్లలకు కంభం లయన్స్ క్లబ్ సభ్యులు చేయూత అందించారు. దాతల సహకారంతో నిర్మించే ఇంటి నిర్మాణంలో మౌలిక వసతుల కల్పనకు లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు బైసాని రామకృష్ణ రూ.22 వేలు, హుస్సేన్ బేగ్ రూ.12 వేల విలువ కలిగిన ఇంటి నిర్మాణ సామగ్రిని అందజేశారు.

పంపిణీకి సిద్ధంగా విద్యా సామగ్రి

పీసీపల్లి: మండలంలోని ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులకు 2024–25 విద్యాసంవత్సరానికి విద్యాసామగ్రి ఎమ్మార్సీలో పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఎంఈఓలు సంజీవ్‌రావు, శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం వచ్చాయని పాఠశాలల హెచ్‌ఎంలు తగిన పత్రాలతో వచ్చి తీసుకోవాలని కోరారు.



రోడ్డు మార్జిన్‌లో చేరిన వర్షం నీరు

వర్షం నీటితో నిండిన రోడ్డు మార్జిన్లు

పొదిలి: పట్టణంలోని ప్రధాన రహదారిలో మార్కాపురం అడ్డరోడ్డు నుంచి విశ్వనాథపురం ఆంజనేయ స్వామి గుడి వరకు రోడ్డు మార్జిన్లు వర్షం నీటితో నిండిపోతున్నాయి. దీంతో వర్షం కురిసిందంటే నాలుగైదు రోజుల పాటు రాక పోకలకు అవస్థలు తప్పటం లేదు. వర్షాకాలం అయితే నిత్యం సమస్యగానే ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎదురెదురుగా వాహనాలు వచ్చే సమయంలో సైడు ఇచ్చేందుకు కూడా వీలు పడని పరిస్థితి నెలకొందని డ్రైవర్లు చెబుతున్నారు. వాహనాలు వేగంగా వెళ్ళే సమయంలో నీరంతా ద్విచక్ర వాహనదారులు, పాదచారులపై పడుతోంది. దుకాణదారులు తమ భవనాల ముందు మట్టి మెరగ్గా వేస్తుంటారు. దీంతో వర్షం నీరు అంతా రోడ్డు మార్జిన్‌లకే చేరుతుంది. అధికారులు మట్టిని తవ్వి మమ అనిపిస్తుంటారు. దుకాణదారులు మళ్లీ మట్టి తోలుకుంటుంటారు. దీంతో ప్రతి ఏటా సమస్య అలానే ఉంటుంది. ప్రధాన రహదారి పక్కన సైడు కాలువలు ఏర్పాటు చేయటం ద్వారా నీటిని కాలువల్లోకి పోయేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మేధోశక్తి పెంపొందించడం అభినందనీయం



మాట్లాడుతున్న సంఘ సేవకుడు జీవీ రత్నం

- వేసవి విజ్ఞాన శిబిరాలు ముగింపు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

దర్శి: విద్యార్థులకు మేధోశక్తి పెంపొందించడం అభినందనీయమని సంఘ సేవకులు జీవీ రత్నం అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ముగింపు కార్యక్రమానికి జీవీరత్నం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా అతిథులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. జీవీ రత్నం మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్ నిర్మాతలన్నారు. వేసవి సెలవుల్లో చెడు తిరుగుళ్లు లేకుండా విజ్ఞాన శిబిరాలకు రావడంతో విద్యార్థులు చైతన్య వంతులవుతారని చెప్పారు. యూటీఎఫ్ సీనియర్ నాయకులు సహజకవి అట్లూరి రామారావు మ్లాడుతూ విద్య ఎక్కువగా స్త్రీలకు అవసరమన్నారు. అప్పుడే సమాజంలో గుర్తింప బడుతారని చెప్పారు. అట్లూరి సుస్మ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. శ్రీనివాస్, పి.గోపి, నాగార్జునరెడ్డి, కోటేశ్వరరావు, కోటయ్య, వీవీ సుబ్బయ్య, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలల పునఃప్రారంభం రోజే పాఠ్యపుస్తకాలు



పాఠ్యపుస్తకాల స్టాక్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర్

- మార్కాపురం డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర్

కొమరోలు: పాఠశాలలు పునఃప్రారంభమైన రోజే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు మార్కాపురం డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర్ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉచిత పాఠ్యపుస్తకాల స్టాక్‌ను పరిశీలించారు. మండలంలోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను రెండు విడతల్లో స్టాక్ పాయింట్‌కు చేరినట్లు తెలిపారు. పాఠ్యపుస్తకాలను ఉచిత రవాణా సౌకర్యంతో నేరుగా పాఠశాలలకు ప్రభుత్వమే చేరవేస్తుందన్నారు. మండలంలోని నల్లగుంట్ల ఎయిడెడ్, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను విద్యార్థులు లేకపోవడంతో పూర్తిగా మూసివేసినట్లు చెప్పారు. గోపాలునిపల్లెలోని ఏబీఎం ఎయిడెడ్ పాఠశాలలో సరిపడనంత విద్యార్థులు లేరని తెలిపారు. ఎయిడెడ్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను మండలంలో ఖాళీగా ఉన్న పాఠశాలలకు డిప్యుటేషన్‌పై పంపిస్తున్నట్లు తెలిపారు. మార్కాపురం డివిజన్‌లో అర్ధవీడు, దోర్నాల, పుల్లలచెరువు, యర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరని, విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే సర్దుబాటు చర్యలు చేపడతామని తెలిపారు. డీఈఓ వెంట మండల విద్యాశాఖాధికారులు కె.వెంకటేశ్వర్లు, బి.వెంకటరత్నం, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, రవీంద్రరెడ్డి, సీఆర్పీలు రామాంజనేయులు, నారాయణ, అంజనేయులు పాల్గొన్నారు.

నవజాత శిశువు మృతిపై కేసు

కురిచేడు: స్థానిక తాగునీటి చెరువులో నవజాత శిశువు మృతదేహం పడేసిన విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేసినట్లు ఆయన చెప్పారు.

తువ్వపాడు వీఆర్‌ఏ మృతి



నివాళులర్పిస్తున్న తహసీల్దార్ షాజిద



బాలకృష్ణ (ఫైల్)

కొనకనమిట్ల: మండలంలోని తువ్వపాడు పంచాయతీ వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న ఈశా బాలకృష్ణ (36) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. బాలకృష్ణ స్వగ్రామం మండలంలోని గొట్లగట్టు పంచాయతీ నాయుడుపేట గ్రామం కాగా కొన్నేళ్లుగా తువ్వపాడు వీఆర్‌ఏగా పని చేస్తున్నాడు. బాలకృష్ణ కొన్ని రోజులుగా పక్షవాతంతో బాధపడుతున్నాడని మూడు రోజుల నుంచి ఆరోగ్యం సహకరించక ఇంటి వద్దనే ఉంటూ గురువారం ఆరోగ్యం క్షీణించి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. వీఆర్‌ఏ బాలకృష్ణ మృతి చెందారని తెలుసుకున్న మండల తహసీల్దార్ షాజిద, వీఆర్‌ఓలు బాబాజీ, జానయ్యలు నాయుడుపేట వెళ్లి బాలకృష్ణ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల రూపాయలను బాలకృష్ణ భార్య కొండమ్మకు అందజేశారు.

కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు



చౌక్ సెంటర్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు



కాలేజీ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కంభం: పట్టణంలోని పలు చోట్ల విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని చౌక్ సెంటర్, జామియా మసీదు సెంటర్, కాలేజ్ రోడ్, ఇంకా పలు చోట్ల స్తంభాలకు ఉన్న ప్రధాన లైన్లు, రోడ్డుకు ఒకవైపు నుంచి మరొక వైపునకు వెళ్లే సర్వీసు వైర్లు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రధాన వీధుల్లో హోల్‌సెల్ దుకాణాలు, రేషన్ షాపులు ఉండటంతో మార్గంలో లారీలు, పెద్ద పెద్ద వాహనాలు వస్తుంటాయి. వీటితో పాటు స్కూల్ బస్సులు ఉదయం, సాయంత్రం తిరుగుతుంటాయి. ఆ సమయంలో తీగలు కిందకు వేలాడుతుండటంతో తీగలు తగిలి ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో గడ్డి, సొప్పలోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైన సంఘటనలు ఉన్నాయి. ఇటీవల కాలంలో రావిపాడు రోడ్డులో సొప్పలోడుతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను తాకడంతో స్తంభం విరిగిపోయి తీగలు కిందపడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రక్షణ లేక ప్రమాదకరంగా ఉన్నాయి. పలు వీధుల్లో ఇంకా ఏళ్లనాటి ఇనుప విద్యుత్ స్తంభాలు ఉన్నాయని, వాటిని మార్చి నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని ప్రజలు చెబుతున్నారు. ప్రస్తుతం గాలులతో కూడిన వర్షాలు కురుస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున విద్యుత్‌శాఖ అధికారులు ప్రమాదకరంగా ఉన్న చోట్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.